క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం



తెనాలిఅర్బన్: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదపడతాయని జేఎంజే కళాశాల వైస్ ప్రిన్సిపల్ సిస్టర్ శారద పేర్కొన్నారు. మేరీ మాటి మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా జేఎంజే కళాశాల ఆధ్వర్యంలో పట్టణంలోని సుల్తానాబాద్, సుందరయ్య నగర్, అంగలకుదురులలో బుధవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

దేవస్థానానికి స్టీల్ ప్లేట్స్ వితరణ



తెనాలిఅర్బన్: బాలాజీ మెటల్ స్టోర్స్ నిర్వాహకులు మాలేపాటి హేమ కుమార్ ఆధ్వర్యంలో గంగానమ్మపేటలోని శ్రీరామేశ్వరస్వామి వారి దేవస్థానంలో జరిగే హుండీ లెక్కింపుకు అవసరమైన స్టీల్ ప్లేట్స్‌ను బుధవారం అందించారు. దేవస్థానంలో జరిగిన కార్యక్రమంలో ఈఓ వీవీ రమణ కుమారి, సుబ్బారావు, బొమ్మిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ ఆటోల తనిఖీ



తెనాలిరూరల్: బడి పిల్లలను తరలించే ఆటోలను రవాణా శాఖ అధికారులు తనిఖీ చేశారు. తెనాలి పట్టణంలో ప్రైవేటు పాఠశాలల పిల్లలను తరలించే ఆటోలను ప్రాంతీయ రవాణా అధికారి ప్రసాద్, మోటారువాహన ఇన్‌స్పెక్టర్ రాఘవరావు, అసిస్టెంట్ మోటార్ వెహికల్‌ఇన్‌స్పెక్టర్ మధుసూదనరావు తమ సిబ్బందితో కలిసి బుధవారం సాయంత్రం తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తున్న పలు ఆటోలను గుర్తించి అపరాధ రుసుం విధించారు. 12 ఏళ్ల లోపు వయసున్న విద్యార్థులను కేవలం ఆరుగురిని మాత్రమూ ఆటోలో ఎక్కించుకోవాలని, డ్రైవర్ వెంబడి, వెనుక డోర్ తెరచి విద్యార్థులను ఎక్కించుకోకూడదని డ్రైవర్లకు సూచించారు. విద్యార్థుల బ్యాగులు, లంచ్‌బాక్సులు ఎట్టిపరిస్థితుల్లోనూ వాహనానికి బయట వేలాడదీయకూడన్నారు. కొద్ది రోజుల పాటు స్కూల్‌ఆటోల తనిఖీ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు.

రైలు ఢీకొని వృద్ధురాలి మృతి

తెనాలిరూరల్: రైలు ఢీకొని గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందిన ఘటన తెనాలి రైల్వే స్టేషన్‌లో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. జీఆర్పీ పోలీసుల కథనం మేరకు సుమారు 65 ఏళ్ల వయసున్న వృద్ధురాలు తెనాలి రైల్వేస్టేషన్‌లో మూడో నంబరు ప్లాట్‌ఫాం నుంచి పట్టాలు దాటుతూ నాలుగో నంబరు ప్లాట్‌ఫాంకు వెళ్తుండగా రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఘటనాస్థలాన్ని జీఆర్పీ పోలీసులు పరిశీలించారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోస్టాఫీసుల్లో ప్రజలందరికీ జాతీయ జెండాలు



తెనాలి: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా 76వ స్వాతంత్ర్య దినోత్సవాన ప్రతి ఇంటిపైనా మన జాతీయ జెండా ఎగరాలి అనే భావనతో భారత ప్రభుత్వం ‘హర్ ఘర్ తిరంగా’ను ప్రవేశపెట్టినట్టు తెనాలి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ డీఎల్ఆర్ఎస్‌జే ప్రసూనరెడ్డి వెల్లడించారు. ఇందుకోసమని జాతీయ జెండాలను పోస్టాఫీసుల్లో ప్రజలందరికీ అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. కార్యక్రమం విజయవంతం కోసం బుధవారం స్థానిక నటరాజ్ జ్యువెల్లరీ యాజమాన్యం 300 జాతీయ జెండాలను కొనుగోలు చేసినట్టు చెప్పారు. తెనాలి డివిజను పరిధిలోని అన్ని పోస్టాఫీసుల్లో జాతీయ జెండాలను అందుబాటులో ఉన్నాయనీ, ప్రతిఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వీరితో నటరాజ్ జ్యువెల్లరీ యజమాని కొత్తమాసు కుమార్, ఎంఈ పవన్‌కుమార్, పోస్టల్ సిబ్బంది ఉన్నారు.

మిషన్ ఇంద్రధనస్సును సద్వినియోగం చేసుకోవాలి

ఫిరంగిపురం: మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎక్స్‌టర్నల్ మానిటర్ డబ్ల్యూహెచ్‌వో టీం (ఢిల్లీ) సభ్యుడు ప్రశాంత్ చెప్పారు. మండలంలోని నుదురుపాడు సబ్‌సెంటర్‌ను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వ్యాక్సిన్ వేస్తున్న తీరు, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 0–5ఏళ్ల లోపు చిన్నారులు, గర్భిణులకు ఇప్పటివరకు వ్యాక్సిన్ అందకుంటే మిషన్ ఇంద్రధనస్సులో భాగంగా వారిని గుర్తించి ఆరోగ్యసిబ్బంది వ్యాక్సిన్ వేస్తారని చెప్పారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిఅర్బన్: రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని 22వ వార్డు మారీసుపేటలోని మసీదు సమీపం నుంచి బుధవారం సాయంత్రం ప్రారంభించారు. 22వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ షేక్ దుబాయ్ బాబు, వార్డు నాయకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని తెలియజేసి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు ఎంతో నమ్మకంతో గత ఎన్నికల్లో 151 ఎమ్మెల్యే స్థానాల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించారని గుర్తు చేశారు. సీఎం జగన్ నాయకత్వంలో ప్రజల నమ్మకాన్ని మరింత పెంచుకోవడంతో పాటు పేద ప్రజలందరిని అనేక సంక్షేమ పథకాల్లో లబ్ధిదారులుగా చేయడం జరిగిందని చెప్పారు. ఎటువంటి అవినీతికి తావులేకుండా నేరుగా లబ్ధిదారుని బ్యాంక్ అకౌంట్‌లో వాటిని జమ చేయడం జరిగిందని గుర్తు చేశారు. జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు అగ్రవర్ణాలలోని పేదలకు సంక్షేమ పథకాలు అందించినట్లు చెప్పారు. అందుకే ప్రజలు తమకు బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు. 22వ వార్డులో ఇప్పటి వరకు రూ.22.08 కోట్ల సంక్షేమాన్ని అందించినట్లు తెలిపారు. 4150 జనాభా ఉన్న వార్డులో 623 ఇళ్లు ఉన్నాయన్నారు. అలాంటి వార్డులో 645 ఇళ్ల స్థలాలు ఇవ్వటం జరిగిందని చెప్పారు. చేయుత-528, అసరా-831, సున్నా వడ్డీ-648, విద్యా దీవెన, వసతి దీవెన- 341, కాపు నేస్తం-131 మందికి ఇచ్చినట్లు చెప్పారు. అమ్మ ఒడి-970, రైతు భరోసా-316, పింఛన్-486 మందికి ఇచ్చినట్లు తెలిపారు. కౌన్సిలర్ దుబాయ్ బాబు విజ్ఞప్తి మేరకు చిన్న పల్లె వంతెన నిర్మాణానికి వారంలో చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అలాగే దాని నిర్మాణానికి అవసరమైన నిధులు సమకూర్చనున్నట్లు ప్రకటించారు. అలాగే ప్రజలు తెలియజేసిన సమస్యలను గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ద్వారా సచివాలయానికి వచ్చే రూ.20 లక్షలతో పరిష్కరించనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్, వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, ఇరిగేషన్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, కౌన్సిలర్‌లు తాడిబోయిన రామయ్య, మొఘల్ అహ్మద్ బేగ్, యాతాటి అనీల్, పేరం సంజీవరెడ్డి, గొడవర్తి శ్రీసాయి హరేరామ్, గుంటూరు కోటేశ్వరరావు, తోట రఘురామ్, కొమరబత్తిని జయపాల్, కో అప్షన్ సభ్యులు పెచ్చింగ్ సుభాని, 22వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ ఖాదర్ మస్తాన్, షేక్ రసూల్, షేక్ బాలీ, షేక్ గబ్బార్, పఠాన్ రసూల్, లెగ్ బాజీ, రఫీ, రామకృష్ణ, పెద్ద సంఖ్యలో వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, పలువురు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

నేడు నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ



పోస్టర్ ఆవిష్కరించిన ఖలేదా నసీమ్



వైద్యులతో జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం

తెనాలి: జాతీయ నులిపురుగుల దినోత్సవం ఈనెల 10వ తేదీన జరుపుకుంటున్న సందర్భంగా బుధవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ సంబంధిత పోస్టర్‌ను విడుదల చేశారు. పట్టణ సుల్తానాబాద్‌లోని వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సుల్తానాబాద్ వైద్యాధికారిణి డాక్టర్ పూరిబిండి మహిత ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేశారు. ఆరోగ్య కేంద్రం పరిధిలో మొత్తం 29 పాఠశాలలుండగా, వీటిలో 4,881 మంది విద్యార్థినీ విద్యార్థులున్నట్టు డాక్టర్ మహిత వెల్లడించారు. నులిపురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకుని, వీరిలో ఒకటో సంవత్సరం నుండి 19 ఏళ్ల వయసు పిల్లలకు గురువారం అన్ని ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కాలేజీలు, అంగన్‌వాడి కేంద్రాల్లో ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తామని చెప్పారు. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ప్రభుత్వ వైద్యసిబ్బంది పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా చైర్‌పర్సన్ ఖలేదా నసీమ్ సూచించారు. ఆరోజు మిగిలిపోయిన పిల్లలుంటే మాపప్‌లో భాగంగా ఈనెల 17న వారికి అవే మాత్రలను పంపిణీ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నేడు జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

తెనాలిఅర్బన్: దేశవ్యాప్తంగా నేడు జరగనున్న జాతీయ నులిపురుగుల నివారణా దినోత్సవంలో అందరు పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా మలేరియా అధికారి టిఎంకె సుబ్బరాయణం పిలుపు నిచ్చారు. తెనాలిలోని పలు వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. గురువారం నిర్వహించనున్న నులిపురుగుల నివారణా దినోత్సవ ఏర్పాట్లను పరిశీలించి వైద్యులు, సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. చిన్నపిల్లలు, విద్యార్థులందరికి తప్పనిసరిగా అల్బెండజోల్ మాత్రలు వేయాలని సూచించారు. ఆయన వెంట ఇన్‌చార్జి అసిస్టెంట్ మలేరియా అధికారి వంగల పున్నారెడ్డి, పట్టణ మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, సిబ్బంది దీపాల శ్రీనివాసరావు, బండారు మల్లేశ్వరరావు, దాసరి మల్లేశ్వరరావు తదితరులున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

తెనాలిరూరల్: చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు తెనాలి మండలం కంచర్లపాలెం గ్రామానికి చెందిన ఆలూరి రామ్మోహన్(30) కుటుంబం మండలంలోని గుడివాడ గ్రామంలో హోటల్ నిర్వహిస్తున్నారు. హోటల్‌లోని డబ్బులు తీసుకుని మద్యం సేవిఇస్తూ ఉండడంతో రామ్మోహన్‌ను తల్లిదండ్రులు మందలిస్తుండేవారు. ఈ క్రమంలో నాలుగు రోజుల క్రితం మద్యం తాగి, తల్లిదండ్రులు మందలిస్తారన్న భయంతో గడ్డిమందు తాగాడు. చికిత్స పొందుతూ గుంటూరు జిల్లా వైద్యశాలలో మృతి చెందాడు. వైద్యశాల నుంచి బుధవారం వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్ఐ సీహెచ్. వెంకటేశ్వర్లు తెలిపారు.

బుర్రిపాలెంలో మెడికల్ క్యాంపు



తెనాలిరూరల్ : సినీ నటుడు మహేష్‌బాబు జన్మదినాన్ని పురస్కరించుకుని విజయవాడకు చెందిన ఆంధ్రా హాస్పటల్స్ ఆధ్వర్యంలో మహేష్‌బాబు స్వగ్రామం బుర్రిపాలెంలో బుధవారం భారీ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో వైద్యులు సుమారు నాలుగు వందల మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. గుండె జబ్బులు స్క్రీనింగ్ పరీక్షలు, ఎకోకార్డియోగ్రామ్, రక్త పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు.

వరి పొలాల పరిశీలన



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం మోరంపూడి గ్రామంలోని వరి పంటపొలాలను బుధవారం జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ ఎం.హైమావతి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ వరి పైరు 15 నుంచి 20 రోజుల దశలో ఉందని, రైతులు భూసార పరీక్షా ఫలితాలను అనుసరించి ఎరువులు వాడాలని సూచించారు. ఆఖరు దుక్కిలో గానీ, విత్తనాలు నాటిన 20 రోజుల లోపు కానీ భాస్వరం కలిగిన కాంప్లెక్స్ ఎరువులు వాడాలని వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి ఎం.శిరీష, గ్రామ వ్యవసాయ అధికారులు ఎస్.మల్లికార్జునరెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌డీఎం వర్క్‌షాప్‌కు బోరుపాలెం వలంటీర్



తాడికొండ: తుళ్లూరు మండలం బోరుపాలెం గ్రామ వలంటీర్ దివ్వెల వెంకటేశ్వరరావు నేషనల్ డిజాస్టర్ మేనేజ్మెంట్ వర్క్‌షాప్‌కు హాజరయ్యేందుకు ఎంపికయ్యాడు. ఇతను గత నవంబర్‌లో బాపట్ల ఎక్స్‌టెన్షన్ ట్రైనింగ్ సెంటర్‌లో ఆపద మిత్ర శిక్షణ పొందాడు. ప్రకృతి విపత్తులు, వరదలు సంభవించిన సమయంలో ప్రజలకు ఎలాంటి సేవలు అందించాలి అనేదానిపై వలంటీర్ దివ్వెల వెంకటేశ్వరరావుకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. గ్రామస్థాయిలో వలంటీర్‌గా ఉత్తమ సేవలందించినందుకు వెంకటేశ్వరరావు గతంలో సేవా వజ్ర అవార్డు అందుకున్నాడు. ఇతని ఉత్తమ సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం హర్యానాలో జరిగే నేషనల్ డిజాస్టర్ మేనేజ్మెంట్ వర్క్‌షాప్‌కు ఎంపిక చేసింది. రాష్ట్రం నుంచి ఈ వర్క్‌షాప్‌నకు ముగ్గురిని ఎంపిక చేయగా వారిలో వెంకటేశ్వరరావు ఒకరు. హర్యానాలో ఈ నెల 11న జరిగే నేషనల్ డిజాస్టర్ మేనేజ్మెంట్ అథారిటీ వర్క్ షాపులో వెంకటేశ్వరరావు పాల్గొననున్నారు.

బాలసాహితీవేత్త అబ్దుల్ హకీంజానికి తెలుగు భాషాపురస్కారం



షేక్ అబ్దుల్ హకీంజాని

తెనాలి : పట్టణానికి చెందిన ప్రముఖ బాలసాహితీవేత్త, ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ షేక్ అబ్దుల్ హకీంజానికి ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం తెలుగు భాషా పురస్కారాన్ని ప్రకటించింది. గిడుగు రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా ఈనెల 29న గుంటూరులో జరగనున్న పురస్కారాల ప్రదానోత్సవ సభలో ఈ గౌరవాన్ని అందజేయనున్నట్టు రచయితల సంఘం, ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు సోమేపల్లి వెంకటసుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్ బుధవారం ఆహ్వానం పంపారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న హకీంజాని ప్రవృత్తిగా రచనా సేద్యం చేస్తూ వచ్చారు. మూడు దశాబ్దాలుగా వివిధ దిన, వార, మాస పత్రికలకు 1450 వ్యాసాలు రశారు. ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, ఆసియా వరల్డ్ రికార్డ్స్‌లో వీరి పేరు నమోదైంది. ఇప్పటివరకు 72 పుస్తకాలు రచించారు. వీటిలో బాలల పుస్తకాలు 36 ఉన్నాయి. 270 బాలల కథలు ఉన్నారు. వీరు రచించిన నీతి కథలను మహారాష్ట్ర ప్రభుత్వం 2019, 2020లో 11, 12 తరగతుల తెలుగు పాఠ్యపుస్తకంలో చేర్చడం విశేషం. సాహితీరంగానికి చేసిన సేవలకు తెలుగు విశ్వవిద్యాలయం, ఏపీ పర్యాటకశాఖ, ఆచార్య నాగార్జున యూనివర్శిటీ, రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కారంతో సహా మొత్తం 25 పురస్కారాలను అందుకున్నారు.

భావనారుషి స్వామి ఆలయ హుండీ మాయం



ఆలయ తాళం పగలగొట్టిన దృశ్యం

మంగళగిరి: యర్రబాలెంలో మళ్లీ దొంగలు చెలరేగారు. స్థానిక భద్రావతీ సమేత భావనారుషి స్వామి ఆలయ హుండీని ఎత్తుకెళ్లడంతోపాటు పలు దుకాణాల్లో సరుకులను దోచుకెళ్లారు. సేకరించిన వివరాల ప్రకారం.. యర్రబాలెంలోని భావనారుషి ఆలయంలోకి మంగళవారం అర్ధరాత్రి దుండగులు ప్రవేశించి తలుపు తాళాలు పగులగొట్టి లోపల ఉన్న హుండీని ఎత్తుకెళ్లిపోయారు. బుధవారం ఉదయం ఆలయం ఊడ్చేందుకు వచ్చిన స్వీపర్ హనుమయ్య తాళాలు పగలగొట్టి ఉండడాన్ని గమనించి ఆలయ కమిటీ సభ్యులకు సమాచారాన్ని అందించారు. ఆలయ కోశాధికారి చిల్లపల్లి నాగేశ్వరరావు చోరీ జరిగిన తీరును పరిశీలించారు. హుండీలో సుమారు రూ.5వేల వరకు నగదు ఉండొచ్చునని భావిస్తున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే బండివారి బజారుకు చెందిన గోపిశెట్టి రామయ్య నివాసంలో గుర్తు తెలియని దుండగులు చొరబడి రూ.10వేల విలువైన రాగి బ్రాయిలర్‌ను దోచుకెళ్లారు. ఇక పొగాకు కంపెనీ సమీపంలోని ఓ కిరాణా దుకాణం, 60 లింకుల రోడ్డులోని మరో కిరాణా దుకాణం తలుపుల తాళాలు పగులగొట్టి నూనెప్యాకెట్లను, కొన్ని రకాల సరుకులను దోచుకెళ్లినట్లు యజమానులు చెప్పారు. అంబటినగర్‌లో దివ్య ఫ్యాన్సీ స్టోర్ తలుపు తాళాలు పగులగొట్టారు. అదే సమయంలో స్థానికులు కేకలు వేయడంతో దుండగులు పారిపోయారు. గ్రామంలో ఇటీవల కూడా దొంగలు పలు చోరీలకు పాల్పడిన విషయం తెలిసిందే.

ప్రజా సంఘాల నిరసన

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల గ్రామంలోని మండల కార్యాలయం వద్ద బుధవారం ప్రజా సంఘాల నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్విట్ కార్పొరేట్ దోపిడీ దారులు – క్విట్ మోదీ – క్విట్ కార్పొరేట్ అగ్రికల్చర్ అనే డిమాండ్‌తో మండల కార్యాలయంలో ఎంపీడీవో కుసుమ శ్రీదేవికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధరల పెరుగుదలను నియంత్రించాలని, చిన్న రైతులకు, వ్యవసాయ కార్మికులకు నెలకు రూ.10 వేలు పెన్షన్ ఇవ్వాలని, విద్యుత్ సవరణ బిల్లు 2022ను ఉపసంహరించుకోవాలని, మణిపూర్ మారణకాండకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని, మారణ హోమంలో నష్టపోయిన కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జాతీయ సమితి సభ్యులు లోకం భాస్కరరావు, వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, అధ్యక్షులు జెట్టి బాలరాజు, కౌలు రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు మన్నవ నాగమల్లేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం మంగళగిరి నియోజకవర్గ అధ్యక్షులు యార్లగడ్డ శివయ్య, అఖిల భారత కిసాన్ మహాసభ నాయకులు ఏలేశ్వరరావు, సుధాకర్ పాల్గొన్నారు.

వ్యవసాయ రంగాన్ని ఆదుకోవాలి

సీఐటీయూ జిల్లా నాయకుడు బాబుప్రసాద్



మార్కెట్ వద్ద నిరసన తెలియజేస్తున్న రైతు సంఘం, ఎఐటీయుసీ, సీఐటీయూ నాయకులు

తెనాలిఅర్బన్: వ్యవసాయ రంగాన్ని కేంద్ర ప్రభుత్వం విస్మరించడం వల్ల రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, వారిని వెంటనే ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా నాయకులు కొల్లిపర బాబుప్రసాద్, ఎఐటీయుసీ నాయకులు చెరుకుమల్లి సింగారావులు డిమాండ్ చేశారు. కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల సమన్వయ కమిటీ పిలుపు మేరకు బుధవారం రైతు సంఘాలు, సీఐటీయుల సంయుక్త ఆధ్వర్యంలో మార్కెట్ వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పంటలకు గిట్టుబాటు ధరలు లభించక, రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నడులేని విధంగా పంటల దిగుబడులు తగ్గిపోతున్నాయని తద్వారా ఆహార ధాన్యాల కొరత ఏర్పడే అవకాశం ఉందని చెప్పారు. రైతు సంఘం నాయకులు ములకా శివ సాంబిరెడ్డి మాట్లాడుతూ కేంద్రం చేసిన మూడు నల్ల చట్టాలను పోరాటాల ద్వారా రద్దు చేయించటం జరిగిందని గుర్తు చేశారు. అయిన కేంద్రం వాటిని అనధికారికంగా అమలు చేస్తుందని ఆరోపించారు. కార్మికుల జీవన ప్రమాణం రోజురోజుకు దిగజారి పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు ఎం వెంకటేశ్వర్లు, ఎం పద్మ, ఎం సాంబశివరావు, వి లక్ష్మినారాయణ, ఆర్ దాసు, గణేష్, మరియమ్మ, బి రమాదేవి, ఎం శివపార్వతి, ఎం నాగార్జున, జయలక్ష్మి, పద్మ పాల్గొన్నారు.

నాణ్యతకు, మన్నికకు భారతి సిమెంట్



మేస్త్రికి బీమా బాండ్ అందజేస్తున్న రాజశేఖరరెడ్డి, సురేష్, భవానీశంకర్

తెనాలిరూరల్: భవన నిర్మాణాలు శాశ్వతమైనవని, నిర్మాణం కోసం సాంకేతిక జరిజ్ఞానాన్ని ఉపయోగించి తయారు చేయబడిన నాణ్యమైన సిమెంటు ఎంచుకోవాలని భారతి సిమెంట్స్ అసిస్టెంట్ మేనేజర్(మార్కెటింగ్) పూల సురేష్, సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ ఎన్. భవానీశంకర్ సూచించారు. పట్టణ మోరిస్‌పేట వార్ఫ్ రోడ్డులో బుధవారం రాత్రి శ్రీ సత్యదేవ ట్రేడర్స్ సహకారంతో భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో భవన నిర్మాణ మేస్త్రీలు, కార్మికులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ అధునాతన పరిజ్ఞానంతో భారతి సిమెంట్ తయారవుతుందని తెలిపారు. కట్టడాలు పూర్తి నాణ్యతతో దీర్ఘకాలం మన్నేందుకు దోహదపడుతుందన్నారు. సిమెంటు తయారీకి నాణ్యమైన ముడి పదార్థాలనే తమ కంపెనీ ఎంచుకుంటుందని తెలిపారు. భవానీశంకర్ మాట్లాడుతూ భారతి సిమెంట్ వినియోగించిన కాంక్రీట్‌తో వేసిన శ్లాబులను ఏడు రోజుల అనంతరం తమ కంపెనీ ప్రతినిధులు వచ్చి నాణ్యతా పరీక్షలను చేసి భారతి సిమెంట్ నాణ్యతను భవన నిర్మాణ మేస్త్రీలు, యజమానులకు వివరిస్తామని చెప్పారు. ఇందుకు సంబంధిత డీలరు ద్వారా వివరాలు తెలుసుకుని తమకు సమాచారం అందిస్తే సరిపోతుందన్నారు. మేస్త్రీల సందేహాలను నివృత్తి చేశారు. సదస్సుకు హాజరైన మేస్త్రీలు, కార్మికులకు రూ. లక్ష చొప్పున ఉచిత బీమా సదుపాయం కల్పించి బాండ్లను అందజేశారు. సత్యదేవ ట్రేడర్స్ యమాని రాజశేఖరరెడ్డి, ధనుంజయస్టీల్స్ యజమాని దామోదర్‌రెడ్డి, ఇతర డీలర్లు, భవన నిర్మాణ మేస్త్రీలు, కార్మికులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు గద్దర్



గద్దర్‌కు నివాళులర్పించిన నేతల

తెనాలి: అయిదు దశాబ్దాల విప్లవ, సాంస్కృతిక ఉద్యమంలో ప్రజా వాగ్గేయకారుడుగా గద్దర్ చిరస్మరణీయమైన కృషి చేశారని బుధవారం సాయంత్రం స్థానిక గాంధీనగర్‌లోని ప్రజా నాట్యమండలి కార్యాలయంలో జరిగిన సంతాప సభలో పలువురు నివాళులర్పించారు. విప్లవ సాంస్కృతికోద్యమానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. తన శరీరంలో తూటాను భరించి విప్లవోద్యమం నుంచి వైదొలగినా, ప్రజావిముక్తిబాటలో రాజకీయ పార్టీలందరికీ ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. అంబేద్కరిస్టుగా, బౌద్ధవిధానం స్వీకరించినా ప్రజల కోసం జీవించిన కళాకారుడిగా గద్దర్ చరిత్రలో నిలిచారని చెప్పారు. ప్రజాసాహితి సంపాదకుడు కొత్తపల్లి రవిబాబు, సీపీఐ (ఎంఎల్) రాష్ట్ర నాయకుడు లోకం భాస్కరరావు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు, పి.రవికుమార్, ‘భారత్ బచావో’ అధ్యక్షుడు డీఎస్ఎన్ నాగేశ్వర్, కోలా జ్యోతి తదితరులు గద్దర్‌తో తమకు గల అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. తొలుత ప్రజానాట్యమండలి కళాకారులు పాటలతో నివాళులర్పించారు. కనపర్తి బెన్‌హర్ పర్యవేక్షించారు.

వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఆదివాసీ దినోత్సవం



తాడేపల్లిలో ఏకలవ్య, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నేతలు

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి మున్సిపల్ కార్యాలయం వద్ద బుధవారం స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన జేసీఎస్ కన్వీనర్ ఈదులమూడి డేవిడ్‌రాజు, పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షులు మేడా వెంకటేశ్వరరావు (పండు) డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఏకలవ్య విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆదివాసుల కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా సోషల్ మీడియా అధ్యక్షులు మేకా వెంకటరామిరెడ్డి, జిల్లా ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి చిన్నపోతుల దుర్గారావు, ఎస్సీ, బీసీ, మైనార్టీ అధ్యక్షులు ముదిగొండ ప్రకాష్, బత్తుల దాసు, సయ్యద్ రసూల్, చిలుకోటి శ్రీనివాస మధు, మాజీ ఎంపీటీసీ జీలగ పెదగాలయ్య, గుత్తి అశోక్, సలాం, నాయుడు, రమేష్, కుంచాల శ్రీను, ఉయ్యాల శ్రీనివాసరావు, కె. రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

కొండవీటి వాగులో తూటికాడ తొలగించాలని వినతి



కమిషనర్ షేక్ అలీమ్ బాషాకు వినతి పత్రం అందజేస్తున్న జిల్లా రైతు సంఘం నేతలు

తాడేపల్లిరూరల్ : కొండవీటి వాగులో తూటికాడ, గుర్రపుడెక్కలను తొలగించాలని కోరుతూ సీఆర్‌డీఏ కమిషనర్ షేక్ అలీమ్ బాషాకు రైతు సంఘం నాయకులు బుధవారం వినపత్రం అందజేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ తాడికొండ మండలం లాం నుంచి వచ్చే వర్షపు నీటి ప్రవాహానికి పూడికలు, తూడికాడ, గుర్రపుడెక్క అడ్డు పడి ఆటంకంగా మారిందని, పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయని, పల్లపు ప్రాంతాల్లోని గ్రామాలు జలమయమవుతున్నాయని, తక్షణమే కొండవీటి వాగులో తూడికాడ, గుర్రపుడెక్క, పిచ్చిమొక్కలను తొలగించాలని కోరుతూ వినతిపత్రం అందజేశామని వెల్లడించారు. కార్యక్రమంలో కొండవీటి వాగు ముంపు ప్రాంత రైతులు పాల్గొన్నారు.

వైభవంగా కావడి రథోత్సవం

పాత గుంటూరు: కొరిటెపాడు శ్రీ బాలసుబ్రహ్మణ్యేశ్వర భక్త జన సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి 47వ భరణి, కృత్తిక కావడి రథోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామికి విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపు కొరిటెపాడులో ప్రారంభమై అరండల్‌పేట శ్రీ గంగా మీనాక్షీ సమేత సోమసుందరస్వామి దేవస్థానం వరకు వైభవంగా సాగింది. స్వామికి ప్రత్యేక అలంకరణ, నైవేద్యాలు, తీర్థ ప్రసాద వితరణ గావించారు. సాయంత్రం దేవతా వేషధారణలతో కళాకారుల నృత్యాలు, వాయిద్యాలతో కావడి రథోత్సవం అరండల్‌పేటలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సన్నిధానం వరకు వైభవంగా సాగింది.